క్లుప్తంగా

శాంతియుత ఎన్నికలే లక్ష్యం



కొమ్మూరు(కాకుమాను): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ బలగాలు పనిచేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర అన్నారు. మండలంలోని కొమ్మూరు, పెద్దివారిపాలెం, గార్లపాడు గ్రామాలలో గురువారం సాయంత్రం పోలీస్ బలగాలతో ఎస్ఐ రవీంద్ర కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా గ్రామాలలోని అన్ని పార్టీల నాయకులు, ఓటర్లు పోలీస్‌లకు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు



కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరులో వేంచేసి ఉన్న స్వయంభు కొండపాటూరు పోలేరమ్మ తల్లి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి బత్తుల సురేష్ బాబు తెలిపారు. గత మూడు నెలల అమ్మవారి హుండీ ఆదాయం రూ.5,08,450 (ఐదు లక్షల ఎనిమిది వేల నాలుగు వందల యాభై)లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కంఠమనేని నరేష్ బాబు, గ్రామ పెద్దలు రామినేని తిరుపతిరావు, మండవ శ్రీనివాసరావు, గుంటుపల్లి నాగేశ్వరరావు, పాలినేని రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

37 మంది వలంటీర్ల తొలగింపు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామ సచివాలయాలకు చెందిన 37 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో కె.జ్యోతి ఆదేశాలు జారీ చేశారు. చేబ్రోలు-1 గ్రామ సచివాలయంకు చెందిన ముగ్గురు, చేబ్రోలు-2కు చెందిన ఏడుగురు, చేబ్రోలు-3కు చెందిన నలుగురు, చేబ్రోలు-4కు చెందిన ఆరుగురు, చేబ్రోలు-5కు చెందిన 14 మంది, నారాకోడూరు-1కు చెందిన ముగ్గురు వలంటీర్లను ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడినందున విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాక ముందు చేబ్రోలులో జరిగిన సమావేశానికి 37 మంది వలంటీర్లు హాజరైనప్పటికి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఇచ్చిన సమాచారం మేరకు వలంటీర్లను విధుల నుంచి తొలగింపుకు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాక ముందు జరిగిన సమావేశానికి హాజరైన వలంటీర్లను తొలగించటంపై విమర్శలు వస్తున్నాయి.

వైఎస్సార్ సీపీ గెలుపుకు సమష్టిగా పనిచేద్దాం

పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైఎస్సార్ సీపీ గెలుపుకు సమష్టిగా కృషి చేయాలని పార్టీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడంలో సోషల్ మీడియా పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత 58 నెలల కాలంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేసిన కార్యక్రమాలు, నియోజకవర్గంలోని పొన్నూరు పట్టణం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ విజయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు సయ్యద్ సుభాని, షేక్ నాజర్, కోటా శ్రీనివాసరావు, బొద్దులూరి రంగారావు, జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, వట్టిప్రోలు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



అంబటి మురళీకృష్ణను సత్కరిస్తున్న న్యాయవాదులు

మెన్స్ టచ్‌లో అంబటి

పొన్నూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించి, రానున్న ఎన్నికలలో పార్టీకి భారీ విజయాన్ని అందించాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ప్రజలను కోరారు. గురువారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.



మెన్స్ టచ్‌లో దుస్తులు పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ



నివాళులర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశం ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎస్వీపీ రోడ్డులోని మెన్స్ టచ్ టైలర్ షాప్‌లో టైలర్ షేక్ హసునుద్దీన్‌ను పలకరించారు. పట్టణంలో పేరుగాంచిన టైలర్‌గా గుర్తింపు పొందిన హసునుద్దీన్‌ను తనకు కూడా ప్యాంట్ షర్ట్ కుట్టాలని చెప్పి మురళీకృష్ణ కొలతలు ఇవ్వడంతో టైలర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కొబ్బరి బొండాల వ్యాపారులతో పాటు టీస్టాల్ యజమానులతో మాట్లాడారు. పలు ప్రాంతాలలో పర్యటించి ప్రచారం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు సేవలు చిరస్మరణీయం

పొన్నూరు: నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మాజీ శాసనసభ్యులు చిట్టినేని వెంకట్రావు చిరస్మరణీయులని పొన్నూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ కొనియాడారు. గురువారం నిడుబ్రోలులోని వెంకట్రావు స్మృతి వనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు- నిడుబ్రోలు పట్టణాల దాహార్తిని తీర్చటానికి వంద ఎకరాల చెరువును అభివృద్ధి చేసి తాగునీటి సమస్యను తీర్చిన గొప్ప వ్యక్తి చిట్టినేని వెంకట్రావు అని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకం

పొన్నూరు: సమాజంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని వైఎస్సార్‌సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో న్యాయవాదులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన సత్తా న్యాయవాదులకే ఉందన్నారు. వైఎస్సార్ సీపీలో ఓర్పుగా ఉన్న ప్రతి ఒక్కరికీ కచ్చితంగా మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ, కాంగ్రెస్, వామ పక్షాలు కలిసి సీఎం జగన్‌ను గద్దె దింపాలని కుట్రలు చేస్తుంటే, ప్రజలు మాత్రం జగన్‌కు అండగా నిలిచారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రారంభం నుంచి న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సీఎం జగన్ తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఆయనకు సహకారం అందిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని గెలిపించే విధంగా న్యాయవాదులు పాటుపడాలని కోరారు. అనంతరం అంబటి మురళీకృష్ణను న్యాయవాదులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

24న క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

తెనాలి అర్బన్: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 24న తెనాలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌జీవో ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి మార్కెట్ సెంటరులో ఉన్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు గురువారం తనిఖీ చేశారు. అతని వద్ద తొమ్మిది క్వార్టర్లు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మరిదిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడిచేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గుజ్జనగుండ్లకు చెందిన మైమూన్ తన భర్త మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తోంది. ఆమె మరిది ఆదాం షఫీ తరచూ వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. గురువారం అతను దాడి చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



కార్యకర్తలతో మాట్లాడుతున్న గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

- గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కిలారి వెంకట రోశయ్య
- రూరల్ మండలంలో జొన్నలగడ్డ, గోరంట్ల, రెడ్డిపాలెం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగనన్నతోనే సాధ్యమని గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య అన్నారు. గురువారం గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ, గోరంట్ల, రెడ్డిపాలెం గ్రామాల్లోని ఆలయాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చేయగలిగిన ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తూ, అభివృద్ధి పథంలో నడిపించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ఇంటి వద్దకే వచ్చిందని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాలు తీసుకుని సంతోషంగా గడిపారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం, ప్రతి కుటుంబ అభివృద్ధి కోసం పాటుపడుతూ అనేక సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. జగనన్న ఆలోచనలతో విద్యా, వైద్య రంగాల్లో ప్రపంచంలోనే నేటి వరకు లేని అనేక మార్పులు తీసుకొచ్చి ప్రతి పేదవాడు చదువుకునేందుకు, ఆరోగ్యంగా జీవించేందుకు, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రజలకు మేలు చేసే జగనన్నకు మనమంతా తోడుగా ఉండి, రానున్న ఎన్నికల్లో జగనన్నను అఖండ మెజార్టీతో గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మనమంతా సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డిపాలెం, జొన్నలగడ్డ, గోరంట్ల గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు ములుకుదురులో ప్రచారం

పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

24న షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సొలసబ స్టాండు సెంటరులో షిర్డీ సాయినాథ మందిర ,శీతలాంబ వార్షికోత్సవం ఈనెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయపాలక వర్గం సభ్యులు యల్లారెడ్డి, వై.శ్రీనివాసరెడ్డిలు గురువారం తెలిపారు. 24న ఉదయం నగర సంకీర్తన, కాగడహారతి, గణపతి పూజ, పుణ్యాహవాచన, నవగ్రహారాధన, అష్టదిక్పాలపూజ. విశేష అర్చనలు అర్చకులు కె.రాఘవేంద్రశర్మ, వైఖానస ఆగమ పండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహిస్తారని చెప్పారు. 25న విశేష అర్చనలు, అభిషేకాలు, సాయి, హనుమాన్ చాలీసాను పరవస్తు చిన్నయసూరి, గీతాభజన మండలి సభ్యులు గానం చేస్తారన్నారు. 26న విశేష అర్చనలు, భక్తులతో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేస్తామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఉంటుందని చెప్పారు. సాయంత్రం సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శిస్తామన్నారు.

వైభవంగా వసంతోత్సవ చక్రస్నానం



కొల్లిపర: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యహోమం, బలిహరణ పూజలు నిర్వహించి వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ- ఢిల్లీలోని ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్‌తో అవగాహన పత్రాలను మార్చుకున్నారు. రిజిస్ట్రార్ రఘునాథన్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యూనివర్సిటీ అథ్లెట్లకు ఒక ప్రత్యేక వేదికను కల్పిస్తుందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను గుర్తించి వారిలో ప్రతిభను, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ అవకాశాలను అందిస్తారని పేర్కొన్నారు. ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. అగ్రశ్రేణి ప్రతిభను రిక్రూట్ చేయడానికి ఈ అవగాహన ఒప్పందం ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. అథ్లెట్లు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే విధంగా ట్రెనింగ్ ఇవ్వడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



పత్రాలను మార్చుకుంటున్న విజ్ఞాన్ రిజిస్ట్రార్ రఘునాథన్ ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ సీఈవో మోహిత్ సింగ్

స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

తాడేపల్లిరూరల్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో వున్న ప్రతి పోలింగ్ బూత్‌పై పోలీసుల నిఘా ఉందని, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేస్తే సహించేది లేదని తాడేపల్లి ఎస్ఐలు రమేష్, ప్రతాప్‌కుమార్ అన్నారు. గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం, ప్రకాష్‌నగర్, కేఎల్‌రావు కాలనీల్లో సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తూ పలుచోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు హక్కు వినియోగించుకునే వారిని భయభ్రాంతులకు లేదా ప్రలోభాలకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి బూత్‌లో గత ఎలక్షన్‌లలో ఘర్షణకు దిగిన వారు, ప్రలోభాలకు గురిచేసిన వారిని బైండోవర్ చేశామని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే వారిపై కేసులు నమోదు చేస్తామని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.



సీఐఎస్ఎఫ్ బలగాలతో కలసి కవాతు నిర్వహిస్తున్న తాడేపల్లి ఎస్ఐలు రమేష్, ప్రతాప్

గేమింగ్ యాప్‌ల రూపకల్పనలో మెళకువలు అవసరం

తాడేపల్లిరూరల్: విద్యార్థులు గేమింగ్ యాప్‌లను రూపొందించడంలో మెళకువలు నేర్చుకోవాలని కేఎల్‌యూ ప్రోగ్రెషన్ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ అన్నారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన సినీ ఫిలియా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లకు మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. అనంతరం లలిత కళల విభాగం అధిపతి సుభాష్‌తో కలసి పేజ్ టు పిక్చర్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు సుప్రజ, ఆర్.వెంకన్న బాబు, జె.శ్రీధర్ పట్నాలను అభినందించారు. విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ లలిత కళల విభాగం విద్యార్థులు సినీ ఫిలియా కార్యక్రమంలో భాగంగా పలు రకాల ఫొటో ఆల్బమ్‌లు, వీడియో డాక్యుమెంటరీలు తయారు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్ధసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, డిప్యూటీ విభాగాధిపతి జాలాది రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పేజ్ టు పిక్చర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, యలవర్తి సుభాష్ తదితరులు

వీటికి కోడ్ వర్తించదా..!?

పొన్నూరు: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలు చేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించి ఎన్నికల నియమావళిపై స్థానిక అధికారులకు పలు సూచనలు జారీ చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న దూళిపాళ్ల నరేంద్ర గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం దర్శనమిస్తున్నాయి. కానీ అధికారులు మాత్రం వాటికి ముసుగు వేయడంలో పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి శిలాఫలకాలపై పేర్లు కనబడకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వడ్లమూడి సంగం సూపర్ మార్కెట్ వద్ద అమలు కాని ఎన్నికల కోడ్

చేబ్రోలు: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఐదు రోజులు అయిప్పటికీ చేబ్రోలు మండలంలోని కొన్ని ప్రాంతాల్లో టీడీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించికపోవటంపై పలు విమర్శలు వస్తున్నాయి. అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లను తొలగించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో తెలుగుదేశం పార్టీకి చెందిన కొన్నిటికి మినహాయింపులు ఇవ్వటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వడ్లమూడి అడ్డరోడ్డు ప్రాంతంలోని సంగం డెయిరీ సూపర్ మార్కెట్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి కొంత మేర ముసుగు వేశారు. షట్టర్లు, పక్కనే ఉన్న పార్టీ గుర్తులు కనిపిస్తూ టీడీపీ కార్యాలయంగా దర్శనమిస్తుంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో విగ్రహం పక్కన, వెనుక ఉన్న టీడీపీ ప్రచార గుర్తులు తొలగింపుకు నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఫ్లెక్సీలు కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే తొలగించిన అధికారులు, టీడీపీకి చెందిన వాటిని నేటి వరకు తొలగించకపోవటంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.



పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో ఉన్న శిలాఫలకం



ఎంపీ నిధులతో నిర్మించిన సురక్షిత మంచినీటి పథకం టీడీపీ అభ్యర్థి పేరుతో ఉన్న శిలాఫలకం



ఇటికంపాడు రోడ్డులో టీడీపీ స్టిక్కర్‌తో ఉన్న బల్ల



ఎంఈవో కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి పేరుతో ఉన్న శిలాఫలకం

దేవస్థానం వద్ద టీడీపీ నేతల ఫ్లెక్సీలు

చేబ్రోలు: ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో టీడీపీ నేతలకు చెందిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వారికి టీడీపీ నేతలు చంద్రబాబు, ధూళిపాళ్ల నరేంద్ర, పవన్ కల్యాణ్‌ల ఫొటోలు కనిపించే విధంగా ఫ్లెక్సీలను ఉంచారు.



వడ్లమూడి అడ్డరోడ్డు ప్రాంతంలోని సంగం సూపర్ మార్కెట్ వద్ద అమలు కాని ఎన్నికల కోడ్



బాలకోటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని తెనాలి రోడ్డులో కనిపిస్తున్న టీడీపీ నేతల ఫ్లెక్సీలు

పన్నుల వసూలు లక్ష్యం పూర్తి కావాలి

కమిషనర్ వి.నిర్మల్ కుమార్



మంగళగిరి: మార్చి నెలాఖరుకు పన్నుల వసూలు లక్ష్యాన్ని పూర్తిచేయాలని మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ఆదేశించారు. పన్నుల లక్ష్యంపై గురువారం పట్టణంలోని కార్పొరేషన్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లను సిబ్బంది మరింత వేగవంతం చేయాలన్నారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో ప్రతిరోజూ రెవెన్యూ అధికారులు సమీక్షించి పన్నుల వసూలు పెరిగేలా చూడాలన్నారు. ప్రతిరోజు వార్డులలో తిరిగి పన్నులు వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల యజమానులతో సామరస్యంగా చర్చించి లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు.